నమస్తే తెలంగాణ

# సూర్యాపేట

5 | నల్లగొండ, శనివారం 2 మార్చి 2024 | SURYAPET



మేడిగడ్డ బ్యారేజ్ వద్ద మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, బూడిద భిక్షమయ్యగౌడ్

# మేడిగడ్డకు మన నేతలు

- కాళేశ్వర యాత్రకు తరలిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు
- క్షుణ్ణంగా బరాజ్ పరిశీలన
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కాంగ్రెస్ కుట్రలను వివరించిన బీఆర్ఎస్
- టీవీలు, సోషల్ మీడియాలో ఆసక్తిగా తిలకించిన ప్రజలు
- యాత్రకు భువనగిరి, ఆలేరులో ఘన స్వాగతం

యాదాద్రి భువనగిరి/సూర్యాపేట, మార్చి 1 (నమస్తే తెలంగాణ) : కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను బట్టబయలు చేసి ప్రజలకు తెలియజేసేందుకు బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం శుక్రవారం కాళేశ్వర యాత్రకు కదిలింది. మేడిగడ్డ బరాజ్‌లో పిల్లర్లు కుంగిన సాకుతో అసలు ప్రాజెక్టే పనికిరాదన్నట్టు చేస్తూ.. రైతుల పంటలను ఎండబెడుతుండడాన్ని చలో మేడిగడ్డ కార్యక్రమం ద్వారా కండ్లకు కట్టినట్టు వివరించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో పార్టీకి చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు ప్రాజెక్టును సందర్శించారు. ఉమ్మడి జిల్లా నుంచి రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, జడ్పీ చైర్మన్లు గుజ్జ దీపికాయుగేంధర్, ఎలిమినేటి సందీప్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, రవీంద్రనాయక్, నోముల భగత్, నలమోతు భాస్కర్‌రావు, బొల్లం మల్లయ్యయాదవ్, చిరుమర్తి లింగయ్య, బీఆర్ఎస్ నాయకులు బూడిద భిక్షమయ్య గౌడ్, కంచర్ల క్రిష్ణారెడ్డి, గుత్తా అమిత్ రెడ్డి, ఒంటెద్దు నర్సింహారెడ్డి, దూదిమెట్ల బాలరాజుయాదవ్, మండడి సైదిరెడ్డి తరలివెళ్లి బరాజ్‌ను పరిశీలించారు.

### ఆసక్తిగా వీక్షించిన జనం

కాంగ్రెస్ ప్రభుత్వం బరాజ్ మరమ్మతుల విషయంలో తీవ్ర జాప్యం చేస్తున్న నేపథ్యంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. దీని ద్వారా కాళేశ్వరం ప్రాజెక్ట్ సమగ్ర స్వరూపాన్ని పూసగుచ్చినట్లు వివరించారు. ప్రజెంటేషన్‌ను జిల్లా ప్రజలు టీవీలు, సోషల్ మీడియాలో ఆసక్తిగా తిలకించారు. కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని అర్థం చేసుకున్నారు.



ఆలేరులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు స్వాగతం

### భువనగిరి, ఆలేరులో కేటీఆర్‌కు ఘన స్వాగతం..

కాళేశ్వర యాత్రకు జిల్లా ప్రజలు ఘన స్వాగతం పలికాయి. బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం జిల్లా మీదుగానే బరాజ్ పరిశీలనకు వెళ్లగా భువనగిరిలో యాత్ర బస్సుకు పార్టీ రాష్ట్ర నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి నేతృత్వంలో ఘన స్వాగతం పలికారు. ఆలేరులోనూ యాత్రకు బ్రహ్మరథం పట్టారు. ఆలేరులో బస్సును నిలిపి పార్టీ కేడర్‌కు కేటీఆర్ అభివాదం చేశారు. అక్కడి నుంచి జనగామ జిల్లా మీదుగా కాళేశ్వర యాత్రకు వెళ్లారు.

### స్వార్థ రాజకీయాల కోసం పంటలను ఎండబెడుతున్నారు : ఎమ్మెల్సీ కోటిరెడ్డి

మేడిగడ్డ సందర్శన సందర్భంగా బారేజీని పరిశీలించిన అనంతరం ఎమ్మెల్సీ కోటిరెడ్డి మాట్లాడుతూ కేవలం స్వార్థ రాజకీయాల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పంటలను ఎండబెడుతున్నదని దుయ్యబట్టారు. ఇంత పెద్ద ప్రాజెక్టులో మూడు పిల్లర్లు కుంగితే యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాల్సిందిపోయి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏదో పాపం చేసినట్లు ప్రచారం చేస్తూ కాంగ్రెస్ తన నైజాన్ని చాటుకుంటున్నదని విమర్శించారు. ఇప్పటికైనా రాజకీయాలు మాని మేడిగడ్డ బారేజీకి మరమ్మతులు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

## కాళేశ్వరం ఆయకట్టుకు నీరందించాలి

- సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట మూడు మండలాల రైతుల ఆందోళన
- పురుగుల మంది తాగేందుకు ప్రయత్నించిన రైతు
- అడ్డుకున్న పోలీసులు

సూర్యాపేట/ఆత్మకూర్.ఎస్, మార్చి 1 : కాళేశ్వరం ఆయకట్టుకు నీరందించాలని సూర్యాపేట జిల్లా రైతాంగం ఆందోళనకు దిగింది. ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నీరు రాక పంటలు ఎండి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేసింది. సూర్యాపేట నియోజక వర్గంలోని ఆత్మకూర్(ఎస్), చివ్వెంల, పెన్‌పహాడ్ మండలాలకు చెందిన రైతులు శుక్రవారం సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున ధర్నా చేశారు. ఆత్మకూర్(ఎస్) మండలం కోటపహాడ్‌కు చెందిన రైతు పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని అక్కడి నుంచి పంపించారు. సూర్యాపేట నియోజకవర్గంలోని ఆత్మకూర్(ఎస్), చివ్వెంల, పెన్‌పహాడ్ మండలాలకు ఎస్సారెస్పీ పరిధిలోని 69, 70, 71వ డీబీఎం కాల్వల్లో నీళ్లు రాకపోవడంతో పంటలు ఎండి పోతున్నాయి. కేసీఆర్ సర్కారులో గత నాలుగు సంవత్సరాలు కాళేశ్వరం జలాలతో చివరి ఆయకట్టు వరకు రెండు పంటలకు నీరందించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అరకొరగా ఇచ్చి చేతులు దులుపుకోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. వేలల్లో పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తున్న రైతులు తీరా పంట చేతికొచ్చే సమయంలో నీరు లేక ఎండి పోతుండడం తట్టుకోలేక ఆందోళనకు దిగారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మరో 15 రోజుల పాటు పూర్తి సామర్థ్యంతో నీరు అందిస్తే తప్ప పంటలు కాపాడుకోలేమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మకూర్(ఎస్) మండలం కోటపహాడ్ గ్రామంలో ఇప్పటికే సుమారు 300 ఎకరాల్లో వరి ఎండి పోయిందని చెప్పారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఈ దుస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. కలెక్టరేట్‌కు రావడానికి ముందు కోటపహాడ్ గ్రామ రహదారిపై రాస్తారోకో చేశారు. పెన్‌పహాడ్ మండలం, చివ్వెంల మండలంలోనూ సాగునీరు లేక భూగర్భ జలాలు సైతం అడుగంటి బోర్లు పోయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బంధు రాకపోయినా అప్పులు తెచ్చి పంట సాగు చేశామని, ఇప్పుడు నీళ్లు కూడా ఇవ్వకపోతే తమ పరిస్థితి ఏంటని వాపోయారు. తన పంట పూర్తిగా ఎండిపోతున్నదని, ప్రభుత్వం వెంటనే కాళేశ్వరం నీటిని విడుదల చేయాలని నూతనకల్ మండల కేంద్రానికి చెందిన మల్లారెడ్డి అనే రైతు పురుగుల మందు తాగడానికి ప్రయత్నించాడు. రైతులు, పోలీసులు ఆయన్ని సముదాయించి అక్కడి నుంచి పంపించారు. ఈ సందర్భంగా రైతులు ఏఓ సుదర్శన్‌రెడ్డికి వినతి పత్రం అందించారు.

## ఆడిట్ కార్యాలయంలో అగ్నిప్రమాదం

- పలు కీలక ఫైళ్లు, ఫర్నిచర్ దగ్ధం
- పరిశీలించిన ఆడిట్ శాఖ ఆర్‌జేడీ రేవతి దేదీప్య



ఆడిట్ కార్యాలయంలో కాలిపోయిన ఫర్నీచర్, ఫైల్స్

నీలగిరి, మార్చి 1 : నల్లగొండ పాత జడ్పీ కార్యాలయంలో ఉన్న జిల్లా ఆడిట్ అధికారి కార్యాలయంలో గురువారం అర్ధరాత్రి సమయంలో అగ్ని ప్రమాదం జరిగింది. దాంతో ఫైళ్లు, కంప్యూటర్లు, కుర్చీలు, సామగ్రి కాలి బూడిదయ్యాయి. అధికారుల సమాచారం మేరకు అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ చాలా సేపటికి గాని మంటలు అదుపులోకి రాలేదు. విషయం తెలువడంతో ఆడిట్ శాఖ ప్రాంతీయ ఉపసంచాలకురాలు రేవతి దేదీప్య వెంటనే కార్యాలయానికి చేరుకొని కాలిపోయిన ఫైళ్లను పరిశీలించారు. ఘటనను గురించి జిల్లా ఆడిట్ అధికారి కృపాకర్‌రావును అడిగి తెలుసుకున్నారు. షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగిందని ఆయన తెలిపారు. ఎక్కువ రికార్డులన్నీ రెండో నంబర్ హాల్లో ఉంటాయని, కొన్ని రికార్డులు మాత్రమే ప్రస్తుతం అగ్ని ప్రమాదం జరిగిన హాల్లో ఉన్నాయని, అందులో కొన్ని కాలిపోయాయని చెప్పారు. సుమారు రూ.6 లక్షల విలువైన సామగ్రి కాలిపోయిందని పేర్కొన్నారు. నాలుగోతరగతి ఉద్యోగులకు సంబంధించిన సర్వీస్ పుస్తకాలు కొన్ని కాలిపోయాయని సిబ్బంది వద్ద ఉన్న సమాచారంతో రికార్డులను తిరిగి రూపొందిస్తామని తెలిపారు. ప్రమాదంపై ఉన్నతాధికారులకు సమాచారం అం దించామని, పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. పూర్తి వివరాలతో పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

### ప్రమాదంపై అనుమానాలు

అగ్ని ప్రమాద ఘటనపై కొందరు పలు రకాల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ జరిగిందా లేక ఏవైనా అక్రమాలకు పాల్పడిన వారు ఉద్దేశపూర్వకంగా చేశారా అనే గుసగుసలు వినిపిస్తున్నాయి.




డెడ్ స్టోరేజీ పరిస్థితుల్లో పుట్టంగండి నుంచి నీటిని తరలించే అప్రోచ్ కెనాల్

## తాగునీటికీ తిప్పలే!

- కుడి కాల్వకు నీటి విడుదల
- ఆంధ్రాకు తాగునీటి కోసమంటూ ప్రకటన
- మరింత తగ్గనున్న సాగర్ నీటి మట్టం
- ఇక ఏఎమ్మార్పీ వద్ద అత్యవసర మోటార్లు తప్పనిసరి

పెద్దఅడిశర్లపల్లి, మార్చి 1 : వానకాలం వరుణుడు కరుణించకపోవడంతో ఎగువ వర్షాల్లేక నాగార్జునసాగర్‌లోకి వరద చేరని సంగతి తెలిసిందే. దాంతో యాసంగి సీజన్‌కు సాగర్, ఏఎమ్మార్పీ ఆయకట్టులో ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటించింది. కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే నీటిని వినియోగిస్తున్నారు. ప్రస్తుతం సాగర్ జలాశయం నీటిమట్టం 516.20 అడుగులకు చేరుకోగా 142 టీఎంసీల మేర నీటి నిల్వ ఉంది. శుక్రవారం ఆంధ్రా తాగునీటి అవసరాల కోసమంటూ కృష్ణా రివర్ బోర్డు ఆదేశాల మేరకు ఎన్ఎస్‌పీ అధికారులు కుడి కాల్వకు నీటిని విడుదల చేశారు. తొమ్మిది రోజుల పాటు మరో 3 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. దాంతో సాగర్ నీటి మట్టం మరింత వేగంగా తగ్గనున్నది. ఏఎమ్మార్పీ నుంచి నల్లగొండ జిల్లాకు, జంట నగరాలకు నిత్యం 700 పైగా క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి ఉంది. దాంతో 510 అడుగుల మేరకు మాత్రమే ఏఎమ్మార్పీ మోటార్లు నడిపే అవకాశం ఉంది. అంత మించి నీటి మట్టం తగ్గితే పుట్టంగండి జీరో పాయింట్ వద్ద అత్యవసర మోటార్లు ఏర్పాటు చేసి అప్రోచ్ కెనాల్‌కు ఎత్తిపోయాల్సి ఉంటుంది. గతంలో అత్యవసర మోటార్లకు కూడా నీరు అందని పరిస్థితుల్లో గత ప్రభుత్వం కృష్ణా నదిలోనే కాల్వ (డ్రెడ్జింగ్ ) తవ్వకం చేపట్టి జంట నగరాల దాహార్తిని తీర్చింది. ఈ వేసవిలోనూ అలాంటి పరిస్థితులు పునరావృతం అవుతాయని అధికారులు భావిస్తున్నారు. సాగర్ డెడ్ స్టోరేజీ నుంచి నీటిని తరలించే సుంకిశాల పనులు ప్రస్తుతం నత్తనడకన సాగుతుండడంతో ఈసారికి సుంకిశాల నుంచి నీటిని తరలించడం అసాధ్యం. పూర్తిగా ఏఎమ్మార్పీ నుంచే నీటిని తరలించాల్సిన పరిస్థితి. గతంలో జీరో పాయింట్ వద్ద నిర్మించిన అత్యవసర మోటార్ల షెడ్ కూడా నీటి మట్టం తగ్గడంతో తేలడం గమనార్హం.



మేడిగడ్డ ప్రాజెక్టును పరిశీలిస్తున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, తదితరులు



అన్నారం ప్రాజెక్టును పరిశీలిస్తున్న కేటీఆర్



మేడిగడ్డకు చేరుకున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కడియం శ్రీహరి, కౌశిక్ రెడ్డి, తదితరులు

కాళేశ్వరం ప్రాజెక్టు యాత్రలో బీఆర్ఎస్ నేతలు కడియం, కేటీఆర్, హరీశ్

## కేసీఆర్‌పై కోపంతో..

# రైతులపై పగబట్టకండి

- మేడిగడ్డకు మరమ్మతులు చేయించి.. నీళ్లను లిఫ్ట్ చేయండి
- 3 పిల్లర్లకు సమస్య వస్తే.. కాళేశ్వరం మొత్తం నష్టపోయిందని బద్నాం చేస్తున్నరు
- రైతులకు కామధేనువు లాంటిది కాళేశ్వరం

'కాళేశ్వరం ప్రాజెక్టు రైతులకు కామధేనువు. అటువంటి కాళేశ్వరాన్ని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయండి. నీళ్లను వెంటనే లిఫ్ట్ చేసి రైతులకు అందించండి. నల్లగొండ సభలో కేసీఆర్ ఇచ్చిన మాట మేరకు బీఆర్ఎస్ నేతలమంతా మేడిగడ్డకు వచ్చాం. ప్రాజెక్టు రక్షణ చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వమే గోబెల్స్ ప్రచారం నిర్వహిస్తున్నది. దాన్ని అడ్డుకుని ప్రజలకు వాస్తవాలు వివరించేందుకే ఇక్కడికి వచ్చాం. 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 21 పంపింగ్ స్టేషన్లు, 273 కిలోమీటర్ల పొడవైన టన్నెల్స్, 1500 కిలోమీటర్లకు పైగా ఉండే కాలువలు కలిగిన భారీ ప్రాజెక్టు కాళేశ్వరంలో కేవలం మేడిగడ్డ బ్యారేజీలో 3 పిల్లర్లకు సమస్యలు వస్తే రాద్ధాంతం చేస్తున్నారు' అని బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వ వైఖరిని తూర్పారబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న దుష్ప్రచారంపై వాస్తవాలు ప్రజలకు తెలియజెప్పేందుకు బీఆర్ఎస్ నేతలు శుక్రవారం చేపట్టిన చలో కాళేశ్వరంలో భాగంగా ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, కడియం శ్రీహరి మాట్లాడారు. కేసీఆర్‌పై కోపముంటే ఆ కోపాన్ని దయచేసి రైతులపై రాష్ట్రంపై చూపవద్దని వారు కోరారు. ఆలస్యం చేయకుండా మేడిగడ్డకు మరమ్మతులు చేయించి రైతులకు సకాలంలో నీళ్లు అందేలా చూడాలని చెప్పారు.



మేడిగడ్డ ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, తదితరులు



మేడిగడ్డ ప్రాజెక్టు వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ నామ నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, తదితరులు



ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, వేముల ప్రశాంత్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్, కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, గండ్ర వెంకటరమణా రెడ్డి, మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్, దేవిప్రసాద్, తదితరులు



మేడిగడ్డ వద్ద కేటీఆర్, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, గంగుల కమలాకర్, తదితరులు